సాక్షి ప్రకాశం

శనివారం। 6। జనవరి। 2024



వినియోగదారులకు చౌకగా మత్స్య ఉత్పత్తులు

మత్స్య శాఖ ఉత్పత్తులను చౌకగా అందించి వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖాధికారి ఆవుల చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. - 8లో..



దర్శిలో యువకుడి ఆత్మహత్యాయత్నం

దర్శి పోలీస్ స్టేషన్‌లో గురువారం అర్ధరాత్రి వేళ ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. - 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 30/22

పొగమంచు అధికంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

9న జాబ్‌మేళా

ఒంగోలు అర్బన్: ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈ నెల 9వ తేదీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పనా అధికారి భరద్వాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలుకు చెందిన రత్నదీప్ రిటైల్ స్టోర్, బాపట్లకు చెందిన మాల్‌టెక్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో క్యాషియర్, కస్టమర్ సపోర్టివ్, ఐటీ, హెచ్‌ఆర్ సెక్టార్‌ల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9వ తేది ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తగిన విద్యార్హత ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12,426 నుంచి రూ.35వేల వరకు వేతనం ఉంటుందన్నారు. వివరాలకు 08592 281776 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఒంగోలులో ఇద్దరికి కరోనా పాజిటివ్

ఒంగోలు టౌన్: ఒంగోలు సర్వజన ఆస్పత్రిలో నిర్వహించిన ఆర్టీపీసీఆర్ పరీక్షల్లో ఇద్దరికి కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. మద్దిపాడు గ్రామానికి చెందిన ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు జ్వరం, ఒళ్లు నొప్పులు ఉండడంతో అనుమానం వచ్చిన వైద్యులు శుక్రవారం ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయించగా పాజిటివ్‌గా నిర్ధారణైంది. గత పదేళ్లుగా సింగపూర్‌లో ఉద్యోగం చేస్తున్న ఆయన నెల రోజుల క్రితమే హైదరాబాద్‌కు వచ్చారు. ఇటీవలే తిరుపతికి వెళ్లి వచ్చినట్లు సమాచారం. 15 రోజుల క్రితం స్వగ్రామమైన మద్దిపాడుకు వచ్చి కుటుంబంతో కలిసి నివాముంటున్నారు. ప్రస్తుతం ఆయన వైద్యుల సలహాపై మద్దిపాడులోని తన నివాసంలో ఐసోలేషన్‌లో ఉన్నారు. అదే విధంగా ఏపీ నెట్‌వర్క్‌లో హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్న 19 ఏళ్ల యువకుడికి ఆర్టీపీసీఆర్‌లో పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. అతడు జ్వరం, ఒళ్లు నొప్పులు, వాంతులు ఉండడంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు వచ్చాడు. అనుమానం వచ్చి వైద్యులు ఆర్‌టీపీసీఆర్ పరీక్ష చేయగా కోవిడ్ పాజిటివ్‌గా తేలింది. చిలకలూరిపేట మండలం పసుమర్తి గ్రామానికి చెందిన అతడు స్నేహితులతో కలిసి ఒంగోలులోని దేవుడిచెరువు వద్ద గదిలో అద్దెకు ఉంటున్నాడు. ఇటీవలే విజయవాడ, చిలకలూరిపేట వెళ్లి వచ్చినట్లు సమాచారం. ఈ యువకుడిని జీజీహెచ్‌లోని ఇండో అమెరికన్ వార్డులో వైద్య చికిత్సలు చేస్తున్నారు. ఈ రెండు నమూనాలను జీనోమ్ ల్యాబ్‌కు పంపించనున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్, ఆర్ఎంఓ డాక్టర్ తిరుమలరావు తెలిపారు. సంబంధింత సమాచారాన్ని జిల్లా వైద్యాధికారికి, స్థానిక వైద్యాధికారులకు తెలియజేస్తామన్నారు. మొత్తం 21 మందికి ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేయగా వారిలో ఇద్దరికి పాజిటివ్ వచ్చినట్లు వివరించారు.

తప్పనిసరిగా మాస్కులు ధరించాలి: డాక్టర్ రాజ్యలక్ష్మి, డీఎంహెచ్‌ఓ

జీజీహెచ్‌లో నిర్వహించిన పరీక్షలలో కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయిన ఇద్దరికి ఎలాంటి ప్రమాదం లేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. మద్దిపాడు ఇంజినీర్‌కు తగిన జాగ్రతలను సూచించి వారిని హోం ఐసోలేషన్‌లో ఉంచినట్లు చెప్పారు. దేవుడు చెరువులో నివాసముంటున్న యువకుడిని జీజీహెచ్‌లో ప్రత్యేక ఏర్పాటు చేసిన ఇండో అమెరికన్ వార్డులో ఉంచి వైద్యం చేస్తున్నట్లు తెలిపారు. కోవిడ్ వ్యాధి ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి సూచించారు. జ్వరం, ఒళ్లు నొప్పులు లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో కానీ సర్వజన ఆసుపత్రిలో కానీ పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు.

బిల్డప్ బాబు.. అదే డప్పు

కనిరిగి అభివృద్ధికి బాధ్యత తీసుకుంటా.. మార్కాపురాన్ని జిల్లా చేస్తా..వెలిగొండను పూర్తి చేసి ఫ్లోరైడ్ బాధితులను ఆదుకుంటా అంటూ చంద్రబాబు పశ్చిమ ప్రకాశంపై నకిలీ హామీలు గుప్పించారు. పద్నాలుగేళ్లు అధికారంలో ఉండి చేయలేని అభివృద్ధి మళ్లీ అధికారం ఇస్తే చేస్తానంటూ మోసపూరిత మాటలతో బురిడీ కొట్టించే ప్రయత్నం చేశారు. అధికారంలో ఉన్న ఐదేళ్లూ ఈ ప్రాంతంపై శీతకన్ను వేసిన ఆయన నేడు ఎన్నికల శంఖారావ సభలో హామీల వర్షం కురిపించడాన్ని చూసిన ఈ ప్రాంతవాసులు నిన్ను నమ్మంబాబూ అంటూ గుసగుసలాడారు. ఈయనగారి శుష్క వాగ్దానాలు వినలేక సభ మధ్యలోనే వచ్చిన జనం వెళ్లిపోవడం కనిపించింది.

నిన్ను నమ్మేదెలా అంటున్న జనం

- ఐదేళ్ల అధికారంలో కనిగిరి కన్పించలేదా బాబూ..
- ట్రిపుల్ ఐటీ, వెలిగొండ జలాలు, నిమ్జ్, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నాడేమయ్యాయి?
- ఎన్నికల వేళ గారడీ మాటలా..
- 'ఉగ్ర' అభ్యర్థిత్వంపై ఊసెత్తని చంద్రబాబు
- కనిగిరి టీడీపీ అభ్యర్థి మార్పు ఉంటుందని టీడీపీ సీనియర్లలో చర్చ



కనిగిరి సభలో డప్పు కొడుతున్న చంద్రబాబు

కనిగిరి రూరల్:

కనిగిరి వేదిక సాక్షిగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఇచ్చిన వాగ్దానాలు విన్న ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఐదేళ్లు (2014–2019)వరకు అధికారంలో ఉన్నప్పుడు కనిగిరి వైపు కన్నెత్తి చూడలేదు. 2019 ఎన్నికలకు ముందుకు నియోజకవర్గంలోని పామూరు మండలం దూబగుంటలో ట్రిపుల్ ఐటీకి శంకుస్థాపన చేసి అడ్రస్ లేకుండా పోయారు. ఇప్పుడు మరళా ఎన్నికలకు ముందు కనిగిరికి వచ్చి కనిగిరి కేంద్రంగా అభివృద్ధి చేస్తానంటూ ఎన్నికల గారడీ మాటలు వల్లించడంతో కనిగిరి ప్రాంత ప్రజలు ఇదేంటీ.. బాబు.. అంటూ నివ్వెరపోతున్నారు. 'రా ..కదిలి రా..' పేరుతో టీడీపీ నేత చంద్రబాబు కనిగిరిలోని చాకిరాల సమీప ప్రాంగణంలో శుక్రవారం ఎన్నికల శంఖారావ తొలి సభకు జన స్పందన కరువైంది. ఈ సభా వేదికగా చంద్రబాబు నాయుడు చేసిన ప్రకటనలపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి.

బాబు మాటలు పచ్చి అబద్ధాలు..

'వెలిగొండ ప్రాజెక్టును తానే శంకుస్థాపన చేసి పనులు దాదాపు పూర్తి చేశానని.. దాన్ని మళ్లీ తానే ప్రారంభిస్తానని ప్రకటిస్తాను' అంటూ ప్రసంగించడంపై జిల్లా వాసులు విస్తుపోతున్నారు. వాస్తవంగా చంద్రబాబు ఐదేళ్ల పాలనలో పది శాతం పనులు కూడా జరగలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చాక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దాదాపు 90 శాతం వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేశారు. అలాగే కనిగిరి ప్రజలకు సురక్షిత నీటి కోసం నాడు రక్షిత మంచినీటి పథకం సమ్మర్ స్టోర్ ట్యాంక్ మంజూరు చేసి కనీసం పునాది రాయికూడ వేయలేదు. ఎన్నికల సమయంలో ట్రిపుల్ ఐటీ కళాశాలకు శంకుస్థాపనతో మమ అని పించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కనిగిరి నిమ్జ్ మంజూరైంది.. పనులు జరగలేదు.. టీడీపీ హయాంలో నిమ్జ్ పూర్తి చేస్తాం లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి కల్పిస్తామని ప్రగల్భాలు పలికి ఐదేళ్ల కన్నెత్తి చూడలేదు.. ఇవన్నీ నిజాలు కాదా.. బాబూ అంటూ ప్రశ్నిస్తున్నారు. మరలా ఇప్పుడు ఎన్నికల వేళ కొత్త డ్రామానా అంటూ నిలదీస్తున్నారు.

ఉగ్రకు ఝులక్..

టీడీపీ ప్రస్తుత కనిగిరి నియోజవకర్గ ఇన్‌చార్జి ఉగ్ర నరసింహారెడ్డికి టీడీపీ అధినేత చంద్రబాబు ఝులక్ ఇచ్చారు. తాను కనిగిరి టీడీపీ అభ్యర్థినంటూ చెప్పుకుంటూ తిరిగిన ఉగ్ర నరసింహారెడ్డికి చంద్రబాబు కనీసం కనిగిరిలో అతని మద్దతు ఇవ్వండి అనే పదం కూడా వాడలేదు. పైగా సామాజిక సమీకరణాల వారీగా సర్వేలు జరుగుతున్నాయి.. వాటి నివేదికల ఆధారంగా గెలుపు అవకాశాలు ఉన్నావారికే టిక్కెట్ ఉంటుందనే భావాన్ని వెలిబుచ్చారు. తనపై కూడా సర్వే జరుగుతుందని మీరంతా పార్టీ ప్రకటించిన అభ్యర్థికి మద్దతు ఇవ్వాలనే సంకేతాన్ని ఇచ్చారు. నేరుగా చంద్రబాబు ఉగ్ర పేరును ప్రస్తావించకపోవంతో ఉగ్రసేనలో తీవ్ర నిరుత్సాహం నెలకొనగా.. పార్టీ అవిర్భానం నుంచి టీడీపీలో ఉన్న పార్టీ శ్రేణులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతలతో బాబు భేటీ

కనిగిరి రూరల్: ఎన్నికల బహిరంగ సభ తర్వాత స్థానిక టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ ఇన్ చార్జిలు, నేతలతో శుక్రవారం రాత్రి భేటీ అయ్యారు. సభలో నెలకొన్న పలు అంశాలపై చర్చించారు. ఆశించినంతగా జనం రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. అనంతరం పార్టీ చేపట్టే భవిష్యత్ కార్యాచరణ, అమలు చేస్తున్న కార్యక్రమాలు, ప్రచార అంశాలపై నేతలకు దిశా నిర్దేశం చేశారు.

నియోజకవర్గాల వారీగా ముగ్గురు నలుగురు నేతలను లోపలికి పిలిచి మాట్లాడారు. ఇదిలా ఉండగా నేతల అంతర్గత సమావేశంలో కూడా చంద్రబాబు కనిగిరి అభ్యర్థిగా ముక్కు ఉగ్ర నరసింహారెడ్డే పోటీలో ఉంటారని ప్రస్తావించకపోవడం గమనార్హం. దీంతో పార్టీ నేతల్లో చర్చనీయాంశంగా మారింది. కనిగిరి నియోజకవర్గ పార్టీ సీనియర్ నేతల (పాత టీడీపీ నాయకుల)తో సీఎం చంద్రబాబు శనివారం ప్రత్యేక భేటీ నిర్వహించే అవకాశం ఉందని కొందరు నేతలు తెలిపారు.



చంద్రబాబు బహిరంగ సభలో జనాలు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

కదిలి రాని జనం..

చంద్రబాబు ఎన్నికల శంఖారావ సభకు నియోజకవర్గ ప్రజలు ముఖం చాటేశారు. పార్టీ నేతలు సకలం ఏర్పాటు చేసినా ప్రాంగణంలో జనం పల్చగా కనిపించారు. జనం లేక కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. అనుకున్న సమయానికే చంద్రబాబు వచ్చినా.. చంద్రబాబు ఉపన్యాసం జరుగుతుండగానే మరికొందరు తమ్ముళ్లు వెనుదిరిగారు. దీంతో ఖాళీ కుర్చీల మధ్య చంద్రబాబు ప్రసంగం సుదీర్ఘంగా సాగింది. సుమారు లక్ష మంది సభకు హాజరువుతున్నట్లు భారీగా ప్రచారం చేసినా అందులో 15 నుంచి 20 శాతం మంది మాత్రమే కన్పించారు. పార్లమెంట్ స్థాయి టీడీపీ సమావేశం కావడంతో ఇతర నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా వచ్చినా.. కనిగిరి నియోజకవర్గం నుంచి మాత్రం తూతూ మంత్రంగా వచ్చారు. సభా వేదిక వద్దకు కనిగిరి నియోజకవర్గ ప్రజలు అంతగా రాలేదని.. తగిన వసతులు, సౌకర్యాలు కల్పించకపోవడం వల్లే ఈ నష్టం జరిగిందంటూ టీడీపీ సీనియర్ నేతలు బహిరంగంగా చెప్పున్నారు.



చంద్రబాబు ప్రసంగిస్తుండగానే సభ నుంచి వెళ్లిపోతున్న ప్రజలు

ఎన్నికలకు కసరత్తు చేస్తున్నాం

- ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నిర్ణయాలు
- 2019 సాధారణ ఎన్నికల కంటే అధికంగా కేంద్ర బలగాలు
- ఈ నెల 9,10 తేదీల్లో ఎన్నికలకు కమిషన్‌కు నివేదిక పంపిస్తాం
- గుంటూరు రేంజ్ ఐజీ పాల్‌రాజ్ వెల్లడి



పోలీస్ అధికారులతో సమీక్షిస్తున్న గుంటూరు పోలీస్ రేంజ్ ఐజీ పాల్‌రాజ్, ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సబర్బన్: ఈ ఏడాదిలో జరగనున్న అసెంబ్లీ, సాధారణ ఎన్నికలకు జిల్లాల వారీగా కసరత్తు చేస్తున్నామని గుంటూరు పోలీస్ రేంజ్ ఐజీ జి.పాల్‌రాజ్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఒంగోలులోని జిల్లా పోలీస్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. తొలుత కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఎస్పీ మలికాగర్గ్‌తో కలిసి డీపీఓ సిబ్బంది, డీసీఆర్‌బీ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అక్కడ పలువురు విధుల్లో ప్రతిభ కనబరిచిన వారికి రివార్డులు ప్రకటించారు. అనంతరం ఒంగోలు డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఒంగోలు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని నేరాలు అందుకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. తరువాత ఐజీ జి.పాల్ రాజ్ మీడియాతో మాట్లాడారు. ఎన్నికలను పురస్కరించుకొని ఎన్నికల కమిషన్ కొన్ని సూచనలు, ఆదేశాలు జారీ చేసిందని, అందులో భాగంగా జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల వారీగా ఉన్న పరిస్థితులను సమీక్షిస్తున్నామన్నారు. జిల్లాలో పోలీస్ పరంగా ఎన్నికల పనులు ఏ విధంగా జరుగుతున్నాయన్న దానిపై లోతుగా అధ్యయనం చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇబ్బందులు కలుగజేసే వారిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యామని చెప్పారు. ఎన్నికల నాటికి నాన్ బెయిల్‌బుల్ వారెంట్లు ఉండకూడదని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలిచ్చామని చెప్పారు. అదే విధంగా పోలీసు అధికారుల బదిలీల్లో దృష్టి సారించి వరుసగా నాలుగేళ్లలో మూడు సంవత్సరాలు లా అండ్ ఆర్డర్‌లో ఉన్న పోలీస్ అధికారులను కచ్చితంగా బదిలీ చేయాల్సి ఉందన్నారు. సొంత జిల్లాల్లో ఉండకూడదన్న నిబంధనను పాటిస్తున్నామని తెలిపారు. రౌడీషీటర్లను గుర్తించి వారి కార్యకలాపాలపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. గత నాలుగు ఎన్నికల్లో జరిగిన పరిస్థితులపై సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. పోలీసింగ్‌లో ఎక్కడా లోపాలు లేవన్నారు. కొందరు అవినీతికి పాల్పడితే ప్రజలు స్పందిస్తున్నారని వివరించారు. ఏసీబీ కేసుల్లో పట్టుబడిన వారిపై కఠినంగా చర్యలు ఉంటాయన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించినా, ప్రజల పట్ల బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించినా వారిపై చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైతే డిస్మిస్ కూడా చేశామన్నారు. సెన్సిటివ్ కేసుల్లో చట్టప్రకారం చర్యలు ఉంటాయన్నారు. పోలీసులను బ్లాక్‌మెయిల్ చేసే వారిపై చట్ట పరిధిలో తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. 2024 ఎన్నికలకు ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. 2019 సాధారణ ఎన్నికల కంటే 2024 ఎన్నికలకు కేంద్ర సాయుధ బలగాలు ఎక్కువగా వస్తాయన్నారు. జిల్లాల వారీగా ఎన్నికల కమిషన్‌కు ఈ నెల 9, 10 తేదీల్లో నివేదిక సమర్పిస్తున్నామని చెప్పారు. సమస్యాత్మక గ్రామాలు, తీవ్ర సమస్యాత్మక గ్రామాలపై పూర్తి స్థాయి నివేదికలు తెప్పించుకుంటున్నామన్నారు. గతంలో ఉన్న సమస్యాత్మక, తీవ్ర సమస్యాత్మక గ్రామాలు ప్రస్తుతం ఉండకపోవచ్చన్నారు. ఆ విధంగా కొత్తవి ఉంటే వాటిని గుర్తిస్తున్నామని వివరించారు. ఐజీ వెంట ఎస్పీ మలికాగర్గ్, ఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాస్, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణ స్వామిరెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, ఒంగోలు తాలూకా సీఐ భక్తవత్సలరెడ్డి, వన్‌టౌన్ సీఐ ఎం.లక్ష్మణ్, టూటౌన్ సీఐ జగదీష్, సింగరాయకొండ సీఐ రంగనాథ్, పలువురు అధికారులు ఉన్నారు.

బాల్యం నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ఒంగోలు: బాల్యం నుంచే యువత భవిష్యత్‌పై స్పష్టమైన లక్ష్యాన్ని విద్యార్థులు నిర్దేశించుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక రామచంద్రామిషన్‌లో జిల్లాలో ఎంపిక చేసిన 20 పాఠశాలలు, ఆరు ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కాలేజీల్లోని 82 మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు భవిష్యత్ ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఉన్నత విద్యావిభాగం కెరీర్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టు పేరుతో మెల్‌బోర్న్ యూనివర్శిటీతో అవగాహన ఒప్పందం చేసుకుందన్నారు. పాఠశాల విద్యార్థులకు కూడా రానున్న ఉద్యోగ అవకాశాలు, అందుకు అందుబాటులో ఉన్న మార్గాలపై అవగాహన కల్పించేలా ఈ ఒప్పందాన్ని విస్తృత పరుచుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో అమలుచేస్తున్న మార్గదర్శిని కార్యక్రమాన్ని కూడా మెల్‌బోర్న్ యూనివర్శిటీ సహకారంతో మరింత ముందుకు తీసుకువెళతామన్నారు. పాఠశాల స్థాయిలోనే వివిధ లక్ష్యాల సాధన కోసం అందుబాటులో ఉన్న అవకాశాలపై మార్గదర్శిని పేరుతో జిల్లా యంత్రాంగం గత ఏడాది నుంచి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిన దృష్ట్యా ప్రకాశం జిల్లా నుంచే ఈ ప్రాజెక్టును ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం శిక్షణ ప్రారంభించామని, జిల్లాలో ఇప్పటికే అమలు చేస్తున్న మార్గదర్శిని తీరును మెల్‌బోర్న్ యూనివర్శిటీ నుంచి వచ్చిన రాక్వెల్ షర్ప్, బెంగళూరు నుంచి వచ్చిన ప్రొఫెసర్ మంజూనాథ్‌కు వివరించారు. ఈ సందర్భంగా వారు సూచించిన అంశాలను కూడా మార్గదర్శినిలో చేరుస్తామన్నారు. రాకెల్ షర్ప్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా లభిస్తున్న ఉద్యోగ అవకాశాలలో గణనీయంగా మార్పు వస్తుందన్నారు. వాటికి తగినట్లుగా విద్యార్థులకు ముందు నుంచే వివిధ లక్ష్యాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వంతో తాము కలిసి పని చేస్తామన్నారు. కలెక్టర్ ముందు చూపుతో ప్రారంభించిన మార్గదర్శిని కార్యక్రమంపై ఆమె ప్రశంసలు కురిపించారు. డీఈఓ వీఎస్ సుబ్బారావు, మార్గదర్శిని జిల్లా నోడల్ అధికారి సామా సుబ్బారావు, ఆర్ఐఓ సైమన్ విక్టర్, డీవీఈఓ శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఏఎంఓ రమేష్, సైన్స్ అధికారి రమేష్ , డైట్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ మేరకు జల్లెడ వేసి మరీ లబ్ధిదారులకు లబ్ధి చేకూరుస్తున్నామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. ఆగస్టు 2023 నుంచి డిసెంబర్ 2023 వరకు అమలైన వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి అర్హత ఉన్నా ఏదైనా కారణంతో లబ్ధి పొందలేకపోయిన అర్హుల ఖాతాల్లో నగదు జమ చేసే కార్యక్రమాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో సమావేశం ద్వారా ప్రారంభించారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి అనుబంధంగా ప్రకాశంభవనంలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు బ్యాంకు చెక్కు అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవరత్నాలు–బై యాన్యువల్ మంజూరు పథకంలో భాగంగా గత ఆరు నెలల్లో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల్లో అర్హత ఉండి లబ్ధి పొందని వారికి ఎనిమిది రకాల పథకాలకు సంబంధించి ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి చేకూరుతున్నట్లు తెలిపారు. వాటిలో ఈబీసీ నేస్తం, జగనన్న అమ్మఒడి, వైఎస్ఆర్ నేతన్న నేస్తం, వైఎస్ఆర్ కాపు నేస్తం, వైఎస్ఆర్ వాహనమిత్ర, జగనన్న చేదోడు, వైఎస్ఆర్ కళ్యాణమస్తు/షాదీతోఫా, మత్స్యకార భరోసా పథకాలు ఉన్నట్లు వివరించారు. జిల్లాలో ఈ పథకాల కింద 3,173 మంది లబ్ధిదారులకు రూ.4,73,86,325 అందిస్తున్నట్లు తెలిపారు. లబ్ధి పొందిన వారు మెరుగైన జీవనోపాధి కోసం పథకాల నగదును వినియోగించుకోవాలని సూచించారు. ఆర్థిక సాయం అందిన లబ్ధిదారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ్‌కుమార్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మహబూబ్, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్‌రెడ్డి, మార్కాపురం డీఎల్‌డీఓ సాయికుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

క్లుప్తంగా

వైద్య ఉద్యోగాల నోటిఫికేషన్‌లో సవరణ

ఒంగోలు టౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో వివిధ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌లో స్వల్ప మార్పులు చేసిన నేపథ్యంలో సవరించనట్లు అదనపు వైద్య సంచాలకులు డాక్టర్ ఎ.ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సవరణ చేసిన వివరాలను ప్రకాశం.ఏపీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను వ్యక్తిగతంగా లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా ప్రభుత్వ వైద్యశాల, ఒంగోలు చిరునామాలో అందజేయాలని స్పష్టం చేశారు. దరఖాస్తులు సమర్పించే గడువును ఈ నెల 6 నుంచి 10వ తేదీకి పొడిగించినట్లు వెల్లడించారు.

లారీ ఢీకొని వృద్ధురాలు దుర్మరణం

త్రిపురాంతకం: బైక్‌ను వేగంగా వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో ఓ వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన జాతీయ రహదారిపై త్రిపురాంతకం మండలం ఉమ్మడివరం సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పల్నాడు జిల్లా చెరుకుంపాలెం గ్రామానికి చెందిన పసుమర్తి వెంకటరమణ(70) తన కుమారుడు అంజయ్యతో కలిసి బైక్‌పై త్రిపురాంకం మండలం ఒడ్డుపాలెం వస్తోంది. ఈ క్రమంలో వినుకొండ వైపు నుంచి త్రిపురాంతకం వైపు వస్తున్న లారీ వెనుక నుంచి అంజయ్య బైక్‌ను ఢీకొట్టింది. వృద్ధురాలు వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందగా ఆమె కుమారుడికి గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం యర్రగొండపాలెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ

ఒంగోలు: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాలీ కోర్సులో నిరుద్యోగ యువతకు ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆ సంస్థ అడ్మిషన్స్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత, ఇంటర్, డిప్లొమా, డిగ్రీలో పాస్ లేదా ఫెయిల్ అయిన వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 26 ఏళ్ల మధ్య ఉన్న యువతకు కడపలో 35 రోజులపాటు శిక్షణ ఇస్తామని, శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌లో అత్యుత్తమ శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 90004 87423ను సంప్రదించాలని సూచించారు.

చంద్రబాబు పచ్చి అబద్ధాలకోరు

- ఏడుపదుల వయసు దాటినా అవే బూటకపు మాటలు
- జనానికి తెలిసిన విషయాలను సైతం నిస్సిగ్గుగా వక్రీకరిస్తున్నారు
- చంద్రబాబు, వైఎస్ జగన్ పరిపాలన బేరీజుకు సవాల్
- మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేసిన జగన్‌ది
- సీఎం వైఎస్ జగన్ పాలనలో జిల్లాలో అన్ని విధాలా అభివృద్ధి
- రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి



ఒంగోలు: ఏడు పదుల వయసు దాటినా చంద్రబాబు అబద్ధాలు మాత్రం నిస్సిగ్గుగా వల్లె వేస్తున్నారని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సలహాదారు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి ధ్వజమెత్తారు. కనిగిరి సభలో చంద్రబాబు చేసిన విమర్శలపై శుక్రవారం తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బత్తుల నిప్పులు చెరిగారు. వెలిగొండ ప్రాజెక్టుకు రెండుసార్లు శంకుస్థాపన చేసి పట్టుమని రూ.10 కోట్లు కూడా ఖర్చుచేయని చంద్రబాబు అది తన ఘనతే అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్, సీఎం వైఎస్ జగన్ పాలనలోనే వెలిగొండ పనులు వడివడిగా సాగాయన్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారం వెలగబెట్టిన చంద్రబాబు.. వెలిగొండ మొదటి టన్నెల్‌ను 2.5 కి.మీ కూడా తవ్వించలేక చేతులెత్తేశారని దుయ్యబట్టారు. 2019లో అధికారం చేపట్టిన సీఎం వైఎస్ జగన్ రెండో సొరంగాన్ని సైతం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారని, త్వరలోనే ప్రాజెక్టును ప్రారంభించనున్న విషయం ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. వైఎస్ జగన్ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదంటూ పచ్చి అబద్ధాలు చెబుతున్న చంద్రబాబును రాజకీయాల నుంచి శాశ్వతంగా సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. 1.40 లక్షలకుపైగా సచివాలయ ఉద్యోగాలు, వైద్య విభాగంలో 52 వేల ఉద్యోగాలు, ఏపీపీఎస్సీ ద్వారా 3 వేలకు పైగా ఉద్యోగాలు జగన్ హయాంలో ఇచ్చారని గుర్తు చేశారు. 17 మెడికల్ కాలేజీలకు శంకుస్థాపన చేసిన సీఎం జగన్ 9 కాలేజీలను ప్రారంభించారని పేర్కొన్నారు. చంద్రబాబు పాలనలో దగాపడిన రైతులు, మహిళలను ఆదుకుని ఆర్థిక భరోసా కల్పించిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు మార్క్‌ఫెడ్‌ను సైతం రంగంలోకి దింపారని గుర్తు చేశారు. చంద్రబాబు పాలనలో 30 లక్షల మందికి మాత్రమే పెన్షన్ లభించేదని, కానీ నేడు 64 లక్షల మంది పార్టీలకు అతీతంగా రూ.3 వేలు పెన్షన్ పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్ది, పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తుంటే కడుపు మంట తట్టుకోలేని చంద్రబాబు, ఎల్లో మీడియా నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుకొంటున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించడమే కాకుండా 22 లక్షల మందికి ఇళ్లు మంజూరు చేసిందని, చంద్రబాబు అధికారంలో ఉన్న 14 ఏళ్లలో ఎందరికి ఇళ్లు కట్టించారో చెప్పాలని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అన్ని రకాల పదవుల్లో ప్రాధాన్యం ఇస్తూ రాజకీయంగా ప్రోత్సహిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. ఆరోగ్యశ్రీని చంద్రబాబు నిర్లక్ష్యం చేస్తే.. చికిత్సల సంఖ్య పెంచడంతోపాటు గరిష్టంగా రూ.25 లక్షల వరకు పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు ముందుకు సీఎం వైఎస్ జగన్ అవకాశం కల్పించారన్నారు. జగన్ పాలనలోనే ఒంగోలులో ఆంధ్రకేసరి యూనివర్సిటీ, మార్కాపురంలో మెడికల్ కాలేజీ ఏర్పాటవుతున్నాయన్నారు. చంద్రబాబుకు 2024 ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

దర్శిలో యువకుడి ఆత్మహత్యాయత్నం

- సోదరుడి బైక్ కోసం గురువారం అర్ధరాత్రి పోలీస్ స్టేషన్‌కు రాక
- అధికారులు లేరు.. ఉదయం రావాలని సెంట్రీ సూచన
- గడియార స్తంభం వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుని స్టేషన్‌లో నిప్పంటించుకున్న వైనం
- వివరాలు వెల్లడించిన దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాజీ

దర్శి: దర్శి పోలీస్ స్టేషన్‌లో గురువారం అర్ధరాత్రి వేళ ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఈ ఘటన పూర్తి వివరాలను శుక్రవారం స్థానిక పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ విలేకరులకు వెల్లడించారు. దర్శి పట్టణంలోని పుచ్చలమెట్టకు చెందిన షేక్ నాగూర్ మీరా గత డిసెంబర్ 27న తిమ్మాయిపాలెం గ్రామ పొలాల్లో బైక్ పార్కింగ్ చేసి మద్యం తాగుతున్నాడు. ఆ గ్రామానికి చెందిన జినుగు వెంకట నారాయణరెడ్డి, నరసయ్య అనే రైతులు గమనించి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేయగా బైక్ వదిలేసి పారిపోయాడు. గతంలో వారి పొలాల్లో నీళ్ల పైపులను ఆ వ్యక్తే దొంగిలించి ఉంటాడన్న అనుమానంతో ఎస్సై రామకృష్ణకు సమాచారం ఇచ్చారు. ఎస్సై తన సిబ్బందితో వెళ్లి రైతులతోపాటు మోటార్‌సైకిల్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. 28వ తేదీన నాగూర్‌మీరాను పిలిపించి విచారించడంతోపాటు బైక్ డాక్యుమెంట్లు చూపించి తీసుకెళ్లమన్నారు. కానీ ఆ తర్వాత నాగూర్‌మీరా స్టేషనుకు రాలేదు. గతంలో ఎస్టీ సామాజికవర్గానికి చెందిన మహిళను పెళ్లి పేరుతో నమ్మించి అత్యాచారం చేసిన కేసులో అరెస్టయి బెయిల్‌పై విడుదలైన నాగూర్‌మీరా తమ్ముడు బాజీ గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో మద్యం మత్తులో పోలీసుస్టేషనుకు వచ్చి బైక్ ఇవ్వాలని సెంట్రీ డ్యూటీలో ఉన్న పి.కిరణ్ మహేష్‌ని అడిగాడు. 'స్టేషన్‌లో అధికారులు లేరు.. శుక్రవారం ఉదయం రావాల'ని చెప్పడంతో బాజీ వెళ్లిపోయాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే గడియా స్తంభం వద్ద బాజీ తాను తెచ్చుకున్న బైక్ నుంచి పెట్రోలు తీసి ఒంటిపై పోసుకుని తహసీల్దార్ కార్యాలయం మీదుగా పోలీస్‌స్టేషనులోకి ప్రవేశించి నిప్పంటించుకున్నాడు. సెంట్రీ విధుల్లో ఉన్న కిరణ్ మహేష్, పోలీస్ సిబ్బంది శ్రీను, జిలానీ, రాజశేఖరరెడ్డి వెంటనే స్పందించి దుప్పట్లు కప్పి మంటలు ఆర్పేశారు. పోలీస్ జీపులో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాజీ కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేశారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు బాజీని అతని కుటుంబ సభ్యులు ఒంగోలు తరలించారు.

మద్యం తాగిన మైకంలో ఎలాగైనా పోలీసులను భయపెట్టి స్టేషన్ నుంచి బైక్ తీసుకెళ్లాలనే ఉద్దేశంలో బయట పెట్రోలు పోసుకుని, లోపలికి వచ్చి నిప్పంటించుకున్నట్లుగా ఔట్‌పోస్టు పోలీసులకు బాజీ వాంగ్మూలం ఇచ్చాడని డీఎస్పీ వెల్లడించారు. బాజీని మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించినట్లు, అక్కడ మేజిస్ట్రేట్ వాంగ్మూలం నమోదు చేసినట్లు తెలిసిందని చెప్పారు. గతంలో అత్యాచారం కేసు నమోదైన సందర్భంలోనూ బాజీ ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు డీఎస్పీ తెలిపారు.

బాలినేని, మాగుంటకు కార్పొరేటర్ల శుభాకాంక్షలు



బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న మేయర్, కార్పొరేటర్లు

ఒంగోలు: మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి నగర మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్లు వెలనాటి మాధవరావు, వేమూరి సూర్యనారాయణతో పాటు పలువురు కార్పొరేటర్లు హైదరాబాద్‌లోని నివాసంలో బాలినేనిని, ఎంపీ మాగుంటను కలిశారు.

పశుపోషకులకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ ఏడీ వెంకటరావు

ఒంగోలు సెంట్రల్: పశుపోషకులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలని పశుసంవర్ధక శాఖ సిబ్బందిని ఆ శాఖ ఏడీ డాక్టర్ ఎస్.వెంకటరావు ఆదేశించారు. శుక్రవారం స్థానిక డీఎల్‌డీఏ సమావేశ మందిరంలో జేడీ డాక్టర్ కె.బేబీరాణితో కలిసి పశువైద్య సహాయ శస్త్ర చికిత్సలపై త్రైమాసిక సమీక్ష నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ పురోభివృద్ధి, లక్ష్యం మేరకు గడ్డి విత్తనాల పంపిణీ వివరాలు తెలుసుకున్నారు. రోజూ విజిట్ చేయాల్సిన విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. పశువైద్యులు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. పశు సంవర్ధక శాఖ జేడీ మాట్లాడుతూ.. అర్హులైన పశుపోషకులకు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు మంజూరు చేసి ఆదాయం పెంపొందించాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ షేక్ కాలేషా, పశువైద్యులు రమేష్, సోమయ్య, వెంకట సుబ్బయ్య, పద్మావతి, ఐఎస్‌డీపీ సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఛాంపియన్‌షిప్ క్రీడాకారులకు సన్మానం



తేళ్లరోహిత్, వెంకట్‌లను అభినందిస్తున్న సంఘ చైర్మన్ మారం వెంకారెడ్డి తదితరులు

ఒంగోలు: ఏషియన్ టెన్నిస్ బాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడంలో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులను జిల్లా అసోసియేషన్ చైర్మన్ మారం వెంకారెడ్డి సత్కరించారు. స్థానిక కబాడీపాలెంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ మారం వెంకారెడ్డి, అధ్యక్షుడు ప్రియ మాట్లాడుతూ మనదేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా జిల్లా కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేసిన తేళ్ల రోహిత్, వెంకట్‌లు క్రీడాకారులకు ఆదర్శమన్నారు. డిసెంబర్ 30 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు నేపాల్‌లో జరిగిన ఛాంపియన్‌షిప్‌లో శ్రీలంక, బంగ్లాదేశ్, సింగపూర్, నేపాల్, భారత్‌లు పాల్గొన్నాయని, అందులో భారత్ తన ప్రత్యర్థి టీం అయిన సింగపూర్‌పై ఘన విజయం కైవసం చేసుకోవడం ద్వారా ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకుందని పేర్కొన్నారు. ఈ ఆటలో మంచి ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన రోహిత్, వెంకట్‌లకు భవిష్యత్‌లోను అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ రవి, తేళ్ల జాన్సన్, ఆయుష్ హాస్పిటల్ డాక్టర్ కిషోర్, ఉపాస్ హాస్పిటల్ డాక్టర్ ప్రకాష్, వైఎస్సార్ సీపీ నేతలు మహబూబ్ బాషా, సినీ నటులు ధన్నారపు మస్తాన్‌రావు పాల్గొని అభినందనలు తెలిపారు.

అంకితభావంతో సేవలందించండి

- సిబ్బందికి వైద్యశాఖ కమిషనర్ జె.నివాస్ సూచన



కౌంటర్లను పరిశీలిస్తున్న వైద్యశాఖ కమిషనర్ నివాస్



వైద్యశాఖ కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు, సర్పంచ్

ఒంగోలు రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందించేందుకు సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ వైద్యశాఖ కమిషనర్ జె.నివాస్ సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం ఒంగోలు రూరల్ మండలంలోని ఉలిచి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో 5 లక్షల మందికి కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు నెలలో 4 రోజులు 4 గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఆరోగ్యం కోసం ప్రతి కుంటుంబం అధిక మొత్తంలో ఖర్చు చేస్తోందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. అవసరమైన వారికి పోస్ట్ ద్వారా ఉచితంగా మందులు సరఫరా చేసేందుకు పోస్టల్ శాఖతో చర్చించినట్లు వెల్లడించారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో డాక్టర్లు ఇచ్చే మందుల కంటే నాణ్యమైనవాటిని ప్రభుత్వం ఇస్తోందని తెలిపారు. 104, 108, ఆరోగ్యమిత్ర, ఏఎన్ఎంలు, నెట్‌వర్క్ హాస్పిటల్‌కు ఫోన్ చేయడం ద్వారా తక్షణ వైద్య సహాయంతోపాటు మందులు పొందవచ్చన్నారు. తొలుత కమిషనర్ జె.నివాస్, జాయింట్ కమిషనర్ సరళమ్మ, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మికి ఎంపీడీఓ పి.అజిత, మెడికల్ ఆఫీసర్ ఎస్.వాణి, సర్పంచ్ మురళి, కార్యదర్శి సురేష్‌కుమార్ ఘన స్వాగతం పలికారు. వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన కౌంటర్లను ఉన్నతాధికారులు పరిశీలించి మెడికల్ ఆఫీసర్ వాణి, హెచ్ఈఓ కృష్ణారెడ్డికి పలు సూచనలిచ్చారు. గ్రామ సర్పంచ్ మంచు మురళి అధ్యక్షతన ఎంపీడీవో పి.అజిత కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ మూర్తి, డీఐఎంహెచ్‌ఓ డాక్టర్ మాధవీలత, కంటి వెలుగు ప్రోగ్రాం డీపీఎం డాక్టర్ నళిని, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుందర్‌ప్రసాద్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు చౌకగా మత్స్య ఉత్పత్తులు

- మత్స్యశాఖ జేడీ చంద్రశేఖరరెడ్డి
- ఫిష్ ఆంధ్రా మినీ రిటైల్ వ్యాపారులకు శిక్షణ



మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ చంద్రశేఖరరెడ్డి

ఒంగోలు సెంట్రల్: మత్స్య శాఖ ఉత్పత్తులను వినియోగదారులకు చౌకగా అందించి వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖాధికారి ఆవుల చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ శిక్షణ కేంద్రంలో శుక్రవారం ఫిష్ ఆంధ్రా మినీ స్టోర్ నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్య శాఖ మాట్లాడుత.. ఫిష్ ఆంధ్ర సెంట్రల్ డెస్క్ నుంచి ప్రాసెసింగ్ చేసిన తాజా నాణ్యమైన మంచి నీటి, సముద్రపు చేపలు, రొయ్యలు, రొయ్య ఉత్పత్తులను చౌకగా కొనుగోలు చేసి వినియోగదారులకు విక్రయించేందుకు గల అవకాశాలను వివరించారు. ఫిష్ మైల్స్ అనే సంస్థ బతికిన చేపలను తక్కువ ఖర్చుతో సుదూర ప్రాంతాల నుంచి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఫిష్ ఆంధ్ర సెంట్రల్ డెస్క్ సంయుక్త సంచాలకులు(మెరైన్) వెంకటేశ్వరరావు, రవిశంకర్, మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఉషారాణి, మత్స్య అభివృద్ధి అధికారులు, గ్రామ మత్స్య సహాయకులు, 60 మంది ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి చెకుముకి పోటీలు



మాట్లాడుతున్న జేవీవీ నాయకులు

ఒంగోలు టౌన్: ఈ నెల 7వ తేదీన జిల్లా స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక గౌరవ సలహాదారు ఏవీ పుల్లారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జయప్రకాష్ తెలిపారు. శుక్రవారం ఎల్బీజీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ సహకారంతో జేవీవీ ఆధ్వర్యంలో ఏడుగుండ్లపాడు శ్రీహర్షిణి జూనియర్ కళాశాలలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత నెలలో మండల స్థాయి పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల విభాగాల్లో మొదటి స్థానం సాధించిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖాధికారి వీఎస్ సుబ్బారావు హాజరుకానున్నారని తెలిపారు. సమావేశంలో జేవీవీ నాయకులు ఎస్వీ రంగారెడ్డి, ఎన్టీ వెంకటేష్, డి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు గ్రూప్-2లో ఉచిత శిక్షణ

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో గ్రూప్-2 ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని కళాశాల చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మీర్జా షంషీర్ అలీబేగ్ పేర్కొన్నారు. కళాశాలలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర మైనార్టీల విద్యాభివృద్ధి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ శాఖ సహకారంతో ముస్లిం, క్రిష్టియన్, బౌద్ధులు, జైనులు తదితర వర్గాల విద్యార్థులకు శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నామన్నారు. పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న ఆంధ్ర బ్యాంక్ పైన ఉన్న రేస్ కోచింగ్ సెంటర్‌లో శనివారం నుంచి క్లాసులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. వివరాలకు 9493431389, 9948887495ను సంప్రదించాలని సూచించారు.

ఒంగోలు: ఏపీపీఎస్సీ వివిధ విభాగాల్లో 900కు పైగా గ్రూప్-2 ఉద్యోగాలకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు లాజిక్ అకాడమీ డైరెక్టర్ పాలపర్తి విజయభాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మైనార్టీల విద్యాభివృద్ధి కేంద్రం(సీఈడీఎం) మైనార్టీల సంక్షేమశాఖ ద్వారా గ్రూప్ 2 పరీక్షలకు 50 మంది విద్యార్థులకు తమ సంస్థలో ఉచిత శిక్షణ ఇస్తామని వెల్లడించారు. ఆసక్తిగల ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బుద్ధిస్టులు, జైనులు, పార్శీలు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7207012758ను సంప్రదించాలని కోరారు.

తన్నుకున్న తెలుగు తమ్ముళ్లు

- 8 మంది టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు
- చంద్రబాబు సభకు జనాన్ని తరలించే విషయంలో ఘర్షణ

పామూరు: టీడీపీ గ్రామ స్థాయి నాయకుడిపై అదే పార్టీకి చెందిన వ్యక్తులు దాడికి పాల్పడిన సంఘటన శుక్రవారం పామూరు మండలం మోట్రావులపాడు గ్రామంలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ ఎం.శ్రీనివాసరావు కథనం మేరకు.. కనిగిరిలో శుక్రవారం నిర్వహించిన చంద్రబాబు సభకు జనాన్ని తరలించేందుకు టీడీపీ నాయకులు శేషం మోసే, డోలా శేషాద్రి, ఎ.వెంకట సత్యనారాయణ మోట్రావులపాడు వెళ్లారు. అక్కడ మెడబలిమి వెంకట్రావు అనే మరో టీడీపీ నాయకుడు వారికి అడ్డు తగిలాడు. ఇది మా గ్రామం.. జనాన్ని తరలించడానికి మీరు ఎవరంటూ వెంకట్రావు ప్రశ్నించాడు. వెంకట్రావుతో పాటు మరో ఏడుగురు కలిసి తమను దూషించి, కర్రలతో దాడి చేశారని శేషం మోషే ఇచ్చిన ఫిర్యాదు మేరకు 8 మందిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

పలకల క్వారీలో వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ డీఎస్పీ, సీఐ

మార్కాపురం రూరల్: మార్కాపురం శివారులోని పలకల క్వారీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. క్వారీలో నుంచి దుర్వాసన వస్తుండటంతో శుక్రవారం అక్కడికి సమీపంలో పనిచేస్తున్న కూలీలు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని ట్రైనీ డీఎస్పీ షహవాజ్, సీఐ ఆవుల వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. స్థానికులతో కలిసి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని వయసు సుమారు 40–45 ఏళ్ల మధ్య ఉండవచ్చని, శరీరంపై అక్కడక్కడా గాయాలు ఉన్నట్లు గుర్తించామని సీఐ తెలిపారు. ప్రమాదవశాత్తు పడిపోయాడా, ఆత్మహత్య లేక హత్య చేశారా తదితర కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతుని వివరాలు తెలిసిన వారు సంప్రదించాలని కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై వెంకటేశ్వర నాయక్ తెలిపారు.

108లో మహిళ ప్రసవం



నవజాత శిశువుతో 108 సిబ్బంది

కొనకనమిట్ల: నిండు గర్భిణిని 108లో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు అధికం కావడంతో అంబులెన్స్ సిబ్బంది సుఖ ప్రసవం చేశారు. మండలంలోని రేగుమానిపల్లి పంచాయతీ గుర్రాలమడుగు గ్రామానికి చెందిన డి.కుమారికి గురువారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. ఆమెను పొదిలి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు తాళలేకపోయింది. దీంతో అంబులెన్స్‌ను రోడ్డు పక్కన నిలిపి ప్రసవం చేశారు. కుమారి ఆడ బిడ్డకు జన్మనిచ్చిందని, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని 108 ఈఎంటీ డి.కాశీంవలి, పైలట్ సురేష్‌బాబు తెలిపారు.